రీ సర్వేతో భూ హక్కు

- బ్రిటిష్ హయాంలో భూములకు హద్దులు
- మండలంలోని 26 గ్రామాల్లో సర్వే పూర్తి
- మరో 10 గ్రామాల్లో చేపట్టేందుకు సన్నాహాలు



పొదలకూరు: వందేళ్ల తర్వాత సమగ్ర భూముల సర్వే గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైంది. ఇందులో భాగంగా మండలంలోని 19 రెవెన్యూ గ్రామాల్లో ప్రక్రియను పూర్తి చేశారు. ఆపై వచ్చిన ప్రభుత్వం మరో ఐదు గ్రామాల్లో రీ సర్వేను నిర్వహించింది.

గత ప్రభుత్వ హయాంలో వినూత్నంగా..

దేశంలోనే తొలిసారిగా గత ప్రభుత్వ హయాంలో భూముల రీ సర్వేను చేపట్టారు. కొన్ని భూములను ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో సర్వే చేయించగా, విజయవంతమైంది. ఎంపిక చేసిన గ్రామాల్లో డ్రోన్లతో ముందుగా మ్యాపింగ్ చేయించాక సర్వేను ప్రారంభించారు. మండలంలో నాలుగు విడతలుగా మొత్తం 26 రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేసి ప్రక్రియను పూర్తి చేశారు. సర్వే జరుగుతున్న సమయంలో గ్రామాలకు తరచూ జేసీ, ఆర్డీఓ హాజరై పరిశీలించేవారు. పూర్తయిన కొన్ని గ్రామాల్లో భూ హక్కు పత్రాలనూ అందజేశారు. తొలిసారిగా ఊట్ల పాళెంలో పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. పొరపాట్లు ఉంటే సరిదిద్దేందుకు సంబంధిత రైతులకు అవకాశమిచ్చారు.

ప్రతి కమతానికీ ఐడీ నంబర్

భూముల వ్యవహారాలపై న్యాయస్థానాలను అధికంగా ఆశ్రయిస్తున్న తరుణంలో రైతులకు సంబంధించిన భూ హద్దులు, దారి గొడవలు ప్రధాన సమస్యలుగా మారాయి. ఈ నేపథ్యంలో రీ సర్వేలో అక్షాంశ, రేఖాంశ ఆధారంగా అధునాతన టెక్నాలజీ ద్వారా మార్కింగ్ చేసి ప్రతి కమతానికీ గుర్తింపు నంబర్‌ను ఇచ్చారు. ఆయా గ్రామాల్లో సర్వే నంబర్ ఒకటి నుంచి కొత్తగా సర్వే నంబర్లను ఇస్తూ ప్రక్రియ పూర్తయ్యాక గ్రామసభను నిర్వహించి పాస్‌పుస్తకాలను అందజేశారు. తొలి విడతలో తొలిసారిగా సర్వే చేసిన మొగళ్లూరులో సమస్యలు నెలకొనడంతో అక్కడి రైతులు వీటిని తీసుకోలేదు. గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేట్‌తో పాటు గ్రామకంఠం భూములనూ సర్వే చేయించారు. గ్రామ హద్దులతో పాటు ప్రభుత్వ భూముల సర్వే, గ్రౌండ్ ట్రూతెనింగ్ జరుగుతోంది.

కొనసాగింపు

గత ప్రభుత్వం చేపట్టిన భూముల రీ సర్వేను ప్రస్తుత ప్రభుత్వం కొనసాగిస్తోంది. కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహం ఉండటంతో మిగిలిపోయిన గ్రామాల్లో ప్రక్రియను చేపట్టింది. రీ సర్వే జరిగితేనే భూముల హద్దులు తెలుస్తాయనే అభిప్రాయంలో రైతులున్నారు. గతేడాది ప్రభుత్వం రీ సర్వే నిర్వహించిన గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించింది.



హద్దు రాళ్లు నాటుతున్న ప్రక్రియను పరిశీలిస్తున్న జేసీ (ఫైల్)

రైతుల సమస్యలను అర్జీల రూపంలో తహసీల్దార్ స్వీకరించారు. మండలంలో మరో పది రెవెన్యూ గ్రామాల్లో మాత్రమే నిర్వహించాల్సి ఉంది. ఇక్కడ ఒకే విడతలో సర్వేను పూర్తి చేసేందుకు అధికారులు యత్నిస్తున్నారు.

పది గ్రామాల్లో రీ సర్వే

మిగిలిన పది గ్రామాల్లో రీ సర్వేను త్వరలో పూర్తి చేయనున్నాం. మండలంలో 36 రెవెన్యూ గ్రామాలకు గానూ 26 గ్రామాల్లో సర్వేను పూర్తి చేశాం. మిగిలిన గ్రామాల్లో ముందుగా గ్రామ హద్దులను నిర్ణయించి ప్రభుత్వ భూములను సర్వే చేయనున్నాం. చివర్లో మండలంలోని పెద్ద గ్రామాలున్నాయి.

– శివకృష్ణయ్య, తహసీల్దార్, పొదలకూరు



క్లుప్తంగా

అరెస్ట్‌ను ఖండిస్తూ సీపీఎం నిరసన ర్యాలీ



సీపీఎం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఉలవపాడు మండలం కరేడు గ్రామంలో రైతు సంఘం నాయకలను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తూ సోమవారం సాయంత్రం నగరంలో సీపీఎం నాయకులు నిరసన ర్యాలీ నిర్వహించారు. బాలాజీనగర్‌లోని ఆ పార్టీ జిల్లా కార్యాలయం నుంచి మినీబైపాస్ రోడ్డులోని పూలే విగ్రహం వరకు ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ సారవంతమైన భూములను ఇండోసోల్ కంపెనీకి కట్టబెట్టేందుకు ప్రభుత్వం బలవంతంగా భూసేకరణకు పూనుకుందన్నారు. జిల్లాలో అనేక ప్రాంతాల్లో బీడు భూములున్నా.. సారవంతమైన భూములను బలవంతంగా లాక్కొనే చర్యతో వేలాది మంది రైతులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కార్పొరేట్ కంపెనీ కోసం అన్నదాతల కడుపు కొట్టటం సరికాదన్నారు. భూసేకరణ కోసం ఇచ్చిన నోటిఫికేషన్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో తలపెట్టిన చలో కరేడు కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన నేతల్ని పోలీసులు అరెస్ట్ చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో నేతలు కె.శ్రీనివాసులు, జి.నాగేశ్వరరావు, మూలం ప్రసాద్, ఫయాజ్, జాఫర్, మురళి, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

చిన్న తరహా పరిశ్రమలకు అండగా ఐఓబీ

- జీఎం ఉన్నికృష్ణన్



మాట్లాడుతున్న జీఎం ఉన్నికృష్ణన్

నెల్లూరు(అర్బన్): సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చే యువతకు ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు (ఐఓబీ) అండగా ఉంటూ విరివిగా రుణాలు అందజేస్తుందని ముంబై నుంచి వచ్చిన జీఎం ఉన్నికృష్ణన్ తెలిపారు. సోమవారం స్థానిక మాగుంట లేఅవుట్‌లోని ఓ ఫంక్షన్ హాల్లో ఐఓబీ విజయవాడ జోన్ ఆధ్వర్యంలో కస్టమర్లతో ఎంఎస్ఎంఈ మంత్–2025 పేరుతో అవగాహన సదస్సు జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఉన్నికృష్ణన్ మాట్లాడుతూ తమకు ఏపీలో 87 బ్రాంచ్‌లున్నాయన్నారు. ఇంటి, వాహన తదితర రుణాలతోపాటు యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే ఎంఎస్ఎంఈ పరిశ్రమలకు పెద్ద ఎత్తున రుణ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. నెల్లూరులో రూ.25 కోట్ల వరకు రుణాలు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో విజయవాడ జోనల్ మేనేజర్ ఎంవీ బంగార్రాజు, విజయవాడ జోన్ ఏజీఎం శ్యాంసన్ మజుందార్, నెల్లూరు మెయిన్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ ఎస్.సందీప్‌కుమార్‌రాజు, పలు వ్యాపారవేత్తలు, కస్టమర్లు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

- సీటు విషయమై గొడవే కారణం

నెల్లూరు(క్రైమ్): రైల్లో నుంచి వ్యక్తిని తోసి హత్య చేసిన నిందితుడిని రైల్వే పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. వారి కథనం మేరకు.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన హబీరుల్లా మోలా (32)కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. అతను కొంతకాలంగా తిరుపూరులోని కోళ్ల ఫారంలో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 15వ తేదీన అతను తన స్వగ్రామం వెళ్లేందుకు తిరువనంతపురం – షాలిమార్ ఎక్స్‌ప్రెస్ రైల్లో బయలుదేరాడు. అదే రైల్లో పశ్చిమ బెంగాల్‌కు చెందిన సైఫుల్లా మండల్ తన స్వగ్రామానికి బయలుదేరాడు. సీటు విషయమై వారి మధ్య గొడవ జరిగింది. దీంతో కోపోద్రిక్తుడైన సైఫుల్లా మండల్ చెముడుగుంట సమీపంలో డోర్ వద్ద నిలబడి ఉన్న హబీరుల్లా మోలాను కిందకు తోసేశాడు. దీంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై ప్రయాణికుల సమాచారంతో రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. సాంకేతికత ఆధారంగా నిందితుడిని అరెస్ట్ చేశామని నెల్లూరు రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎ.సుధాకర్ తెలిపారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

నెల్లూరు రూరల్: మాజీ సైనికులకు కోరమాండల్ కంపెనీ ద్వారా డ్రోన్లపై ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చే కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను సోమవారం కలెక్టర్ ఆనంద్ ఆవిష్కరించారు. తిక్కన ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆనంద్ మాట్లాడుతూ ఈ అవకాశాన్ని మాజీ సైనికులు ఉపయోగించుకోవాలన్నారు. వ్యవసాయానికి తోడ్పాటునందిస్తూ పల్లెసేవ చేస్తూ ఉపాధి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో డీఆర్వో హుస్సేన్ సాహెబ్, జిల్లా సైనిక సంక్షేమాధికారి హరికృష్ణ పాల్గొన్నారు.

ఆలయ పాలకమండలి ప్రమాణ స్వీకారం



తోటపల్లిగూడూరు: మండలంలోని వరిగొండలో కొలువైన జ్వాలాముఖి అమ్మవారి ఆలయ పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకారాన్ని సోమవారం నిర్వహించారు. చైర్‌పర్సన్‌గా కోడూరు రాజేశ్వరి, కమిటీ సభ్యులుగా కర్పూరం భాస్కర్‌రెడ్డి, జానా జ్యోతి, నెల్లూరు కల్పలత, అమృత, మద్దినేటి తిరుపాల్, అన్నం శివకుమార్, బూదూరు మురళి, పిచ్చమ్మ, శ్రీనివాసన్ ప్రమాణ స్వీకారం చేశారు. దేవదాయశాఖ సహాయ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు, ఈఓ తాతా శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, జాఫర్‌సాహెబ్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్ చైర్మన్ సోమిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, తోటపల్లిగూడూరు సహకార బ్యాంక్ అధ్యక్షుడు సన్నారెడ్డి సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవెంకటేశ్వరలో ఓరియంటేషన్



కొడవలూరు: నార్తురాజుపాళెంలోని శ్రీవెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థుల ఓరియంటేషన్ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల చైర్మన్ పీ గుణశేఖర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. వైస్‌చైర్మన్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో ఇన్‌టర్న్‌షిప్‌ను అందజేస్తున్నామన్నారు. విద్యార్థులు నూతన సాంకేతిక అంశాలైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్, డేటా సైన్స్, బ్లాక్‌చైన్, మిషన్‌లెర్నింగ్‌లపై దృష్టిసారించాలన్నారు. అనంతరం తిరుమల వేదపండితులతో విద్యార్థులు, తల్లిదండ్రులు, విభాగాధిపతులకు ఆశీర్వాదం ఇప్పించారు. కళాశాల ప్రిన్సిపల్ ఎం శ్రీనివాసకుమార్, వైస్‌ప్రిన్సిపల్ ఎస్ జయలక్ష్మి, ఏఓ కే గిరీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయిలో ఆధార్ క్యాంపులు

- కలెక్టర్ ఆనంద్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు రూరల్: జిల్లాలో ఆధార్ కార్డుల్లేని ఎస్టీల కోసం వచ్చే నెల ఒకటో తేదీ నుంచి నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఆనంద్ తెలిపారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్లో పీజీఆర్ఎస్ అర్జీలు, ఇళ్ల నిర్మాణాల పురోగతి, ఉపాధి హామీ పనులు, ఎస్టీలకు ఆధార్ కార్డుల మంజూరు మొదలైన అంశాలపై అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్యాంపుల ద్వారా ఇప్పటివరకు 6,000 మందికి పైగా ఆధార్ కార్డులు మంజూరు చేసామని తెలిపారు. పీజీఆర్ఎస్‌లో తరచూ పునరావృతమయ్యే దరఖాస్తులను పరిశీలించేందుకు మండల స్థాయి కో–ఆర్డినేషన్ కమిటీలను నియమించామన్నారు. మండల స్థాయిలోని తహసీల్దార్, ఎంపీడీఓ, పోలీస్ అధికారుల సమన్వయంతో ఆయా దరఖాస్తుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అలాగే సిటిజన్ ఫీడ్‌బ్యాక్‌ను తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. జిల్లాలో గృహ నిర్మాణాలు, ఉపాధి హామీ పనుల పురోగతి మెరుగుపడాల్సి ఉందన్నారు. హౌసింగ్‌లో ఉపాధి హామీని అనుసంధానిస్తూ 90 రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. పాఠశాలల్లో మంచినీటి ఆర్ఓ ప్లాంట్లను ఉపయోగంలోకి తీసుకురావాల్సిందిగా ఆదేశించారు. అదేవిధంగా జిల్లాలో వ్యవసాయేతర అవసరాలకు యూరియాను ఉపయోగిస్తుంటే అటువంటి సమాచారాన్ని వెంటనే జిల్లా వ్యవసాయాధికారికి తెలియజేయాలన్నారు. అలాగే ఈ–క్రాప్ బుకింగ్ చేయడంలో వ్యవసాయాధికారులకు వీఆర్వోలు, సర్వేయర్లు సహకరించే విధంగా తహసీల్దార్లు చర్యలు తీసుకోవాలన్నారు. అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉందని, అందుకనుగుణంగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాన్ఫరెన్స్‌లో డీఆర్వో హుస్సేన్ సాహెబ్, జెడ్పీ సీఈఓ మోహన్‌రావు, హౌసింగ్, డ్వామా పీడీలు వేణుగోపాల్, గంగాభవాని, విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్, డీపీఓ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీఓను ఉపసంహరించుకోవాలని డిమాండ్

- వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు ఆశ్రిత్‌రెడ్డి



జీఓ ప్రతులను దహనం చేసిన నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): స్కూళ్లు, కళాశాలల్లోకి విద్యార్థి సంఘాలు ప్రవేశించకుండా నిషేధిస్తూ ఇచ్చిన జీఓను కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు ఆశ్రిత్‌రెడ్డి డిమాండ్ చేశారు. నెల్లూరులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం జీఓ ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆశ్రిత్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కార్పొరేట్ యాజమాన్యాలకు కొమ్ము కాస్తోందన్నారు. దౌర్జన్యాలను ప్రశ్నిస్తున్న విద్యార్థి సంఘాలు గొంతు నొక్కేందుకు జీఓ విడుదల చేసిందన్నారు. నారాయణ, విద్యాశాఖ మంత్రి లోకేశ్ అండదండలతోనే ఈ జీఓను తీసుకొచ్చారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. జీఓను వెనక్కి తీసుకోకపోతే ఇతర సంఘాలతో కలిసి నిరసన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర సెక్రటరీ రాచాల సతీష్‌బాబు, సిటీ అధ్యక్షుడు తౌఫిక్, రూరల్ అధ్యక్షుడు రోహిత్‌రెడ్డి, సర్వేపల్లి అధ్యక్షుడు హేమంత్, కావలి అధ్యక్షుడు శ్యామ్, సూళ్లూరుపేట అధ్యక్షుడు తేజ తదితరులు పాల్గొన్నారు.

కాకాణికి బెయిల్ మంజూరుపై సంబరాలు

పొదలకూరు: అక్రమ కేసుల్లో జిల్లా జైల్లో రిమాండ్‌లో ఉన్న మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డికి హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో సర్వేపల్లి నియోజకవర్గంలో పార్టీ నేతలు, కార్యకర్తలు సంబరాలు జరుపుకొన్నారు. తమ నేత మంగళవారం బయటకొస్తారని పార్టీ శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆయన్ను పెద్ద ఎత్తున కలిసి పలకరించేందుకు సమాయత్తమవుతున్నారు.

నలుగుర్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు

మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డికి హైకోర్టు బెయిల్ మంజూరు చేసిన నేపథ్యంలో పట్టణానికి చెందిన పార్టీ నేతలు, కార్యకర్తలు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకొన్నారు. పార్టీ నేత మద్దిరెడ్డి రమణారెడ్డి ఆధ్వర్యంలో యువకులు బాణసంచా కాల్చడంతో సమాచారం తెలుసుకున్న పోలీసులు నలుగుర్ని అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని గ్రామాల్లో బాణసంచా కాల్చారు.

63 పింఛన్ల తొలగింపు

మనుబోలు: మండలంలో 63 పింఛన్లను కూటమి ప్రభుత్వం తొలగించింది. ఇటీవల జిల్లా కేంద్రం నుంచి వచ్చిన వైద్యులు పరిశీలన అనంతరం వీటిని తొలగించినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ ముజీబున్నీసా తెలిపారు. మండలంలో మొత్తం 101 మంది దివ్యాంగులు, పక్షవాత వ్యాధిగ్రస్తులు పింఛన్లు పొందుతున్నారు. జిల్లా కేంద్రం నుంచి వచ్చిన వైద్యులు వీరిని ఇటీవల పరిశీలించారు. వైకల్యం 40 శాతం కన్నా తక్కువ ఉన్న వారి పింఛన్లను తొలగించారు. ఒకవేళ వీరి వయస్సు 60 ఏళ్లకుపైగా ఉంటే వారికి వృద్ధాప్య పింఛన్ కింద మార్పు చేశారు. మండలంలో 101 పింఛన్లను వెరిఫికేషన్ చేయగా, 63 తొలగించి, 38ను వృద్ధాప్య పింఛన్లుగా మార్పు చేశారు.

ఫోర్ ఇన్ వన్ డీసీ యూనిట్ ఏర్పాటు



యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఈఈ శ్రీధర్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ నిర్వహణ భారాన్ని తగ్గించడం, ప్రమాదాల నివారణ, వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు సబ్‌స్టేషన్లలో ఫోర్ ఇన్ వన్ డీసీ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నామని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ అన్నారు. నగరంలోని కొండాయపాళెం, బీవీనగర్, రేబాల విద్యుత్ సబ్‌స్టేషన్లలో సోమవారం యూనిట్ పరికరాలను ఈఈ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్‌స్టేషన్లలో 6 బ్యాటరీల ద్వారా ఫీడర్లు, బ్రేకర్లకు విద్యుత్ చార్జింగ్ చేయడం జరుగుతుందన్నారు. వీటి నిర్వహణ భారం ఎక్కువ కావడంతో బ్యాటరీలతో సంబంధం లేకుండా ఫోర్ ఇన్ వన్ యూనిట్ యంత్రాల ద్వారా నేరుగా బ్రేకర్లకు విద్యుత్ చార్జింగ్ అవుతుందన్నారు. జిల్లాలోనే మెదటిసారిగా ప్రయోగాత్మకంగా నెల్లూరు నగరంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటి పనితీరు ఆధారంగా త్వరలో అన్ని సబ్‌స్టేషన్లల్లో పెడతామన్నారు. కార్యక్రమంలో డీఈఈ అశోక్, సుప్రియ, ఏఈలు దామోదర్‌రెడ్డి, లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

'అధైర్యపడొద్దు.. కాకాణి వస్తున్నారు'



పార్టీ శ్రేణులతో పూజిత

పొదలకూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఏమాత్రం అధైర్యపడొద్దని.. తన తండ్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వస్తున్నారని ఆయన కుమార్తె, పార్టీ రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత పేర్కొన్నారు. మండలంలోని కల్యాణపురంలో సోమవారం పర్యటించిన ఆమె.. కార్యకర్తల సమస్యలను ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అన్ని కేసుల్లో బెయిలొచ్చిందని, జైలు నుంచి మంగళవారం బయటకు రానున్నారని చెప్పారు. తన వెన్నంటే ఉన్న వారికి పేరుపేరునా కృతజ్ఞతలను తెలియజేశారు. కూటమి ప్రభుత్వం ఎన్ని రకాలుగా ఇబ్బందులకు గురిచేసినా, గ్రామాల్లో నేతలు తమకు అండగా ఉన్నారని చెప్పారు. మీ అభిమానంతోనే తాము రాజకీయాల్లో కొనసాగుతున్నామని తెలిపారు. అనంతరం గ్రామానికి చెందిన పార్టీ నేత అట్లా రమణారెడ్డి కుమారుడి వివాహం సందర్భంగా వధూవరులను ఆశీర్వదించారు. బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, వెన్నపూస దయాకర్‌రెడ్డి, ఆకుల గంగిరెడ్డి, వెన్నపూస కృష్ణారెడ్డి, బడుగు శ్రీనివాసులు, శ్రీహరి, యానాదిరెడ్డి, ఆకుల గణేష్‌రెడ్డి, రమణారెడ్డి, పొదలకూరు ఎంపీటీసీ లక్ష్మీకల్యాణి తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా బస్ షెల్టర్

- ప్రయాణికుల అవస్థలు



మనుబోలు: ప్రయాణికులకు వసతుల కల్పనలో ఆర్టీసీ అధికారులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. బస్సులు ఆగే చోట కాకుండా అవసరం లేని చోట షెల్టర్లను నిర్మిస్తున్నారు. మనుబోలు కోదండరామపురంలోని తహసీల్దార్ కార్యాలయ సమీపంలో గల బస్ షెల్టర్ నిరుపయోగంగా మారింది. బస్సులు ఆగే మెయిన్ సెంటర్‌ను వదిలేసి బైపాస్ పక్కన గల సర్వీస్ రోడ్డు వద్ద గతంలో దీన్ని నిర్మించారు. ఇక్కడ బస్సులు నిలిచే వెసులుబాటు లేకపోవడంతో నిరుపయోగంగా మారింది. ఫలితంగా ప్రయాణికులు, విద్యార్థులు నానా ఇబ్బంది పడుతున్నారు. విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, ప్రయోజనం లభించడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అక్రమ అరెస్ట్‌లు అమానుషం



సీపీఎం నేతల నిరసన

తోటపల్లిగూడూరు: చలో కరేడులో భాగంగా ఉద్యమంలో పాల్గొన్న సీపీఎం, ప్రజా సంఘాల నేతలను అక్రమంగా అరెస్ట్ చేయడం అమానుషమని సీఐటీయూ మండల కార్యదర్శి మారుబోయిన రాజా పేర్కొన్నారు. కరేడులో జరిగిన అక్రమ అరెస్ట్‌లను ఖండిస్తూ నరుకూరు సెంటర్‌లో నల్ల బ్యాడ్జీలతో నిరసనను సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇండోసోల్ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం ఉలవపాడు మండలం కరేడులో బలవంతపు భూసేకరణకు ప్రభుత్వం పాల్పడుతోందని ఆరోపించారు. తాము చేపట్టిన కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు పార్టీ నేతలను ఎక్కడికక్కడ హౌస్ అరెస్ట్‌లను ప్రభుత్వం చేయించిందని చెప్పారు. అడ్డంకులు దాటుకొని కరేడుకు చేరుకున్న అనేక మంది నేతలు, కార్యకర్తలను అక్రమంగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించిడం అమానుషమన్నారు. సీపీఎం మండల కమిటీ సభ్యులు మోచర్ల రాధయ్య, ప్రభావతమ్మ, వెంకటసుబ్బయ్య, నేతలు ఆరణి గోపీ, ఆకుల రఘు, వేగూరు శంకరయ్య, యాసిన్, సునీల్, నారాయణ, అన్నం పుట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయమా.. గ్రామ సచివాలయమా..!



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని దామరమడుగులో గ్రామ సచివాలయం-2 పేరు గ్రామసచివాలయ గ్రంథాలయంగా రాసి ఉండడంతో ప్రజలు గ్రంథాలయమా లేక గ్రామసచివాలయమా అని తికమకకు గురవుతున్నారు. ఇక్కడ గ్రామసచివాలయం–2ను గ్రంథాలయ భవనంలో తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. అందులోని పుస్తకాలు, ఇతర సామగ్రిని లోపల ఓ మూల ర్యాక్‌లలో ఉంచేశారు. భవనంలోకి వెళ్లి చూస్తే గ్రంథాలయ రూపురేఖలు కనిపించవు. సచివాలయ ఉద్యోగులు కనిపిస్తుండడంతో పుస్తక ప్రియులు తికమకకు గురవుతున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ నారాయణరెడ్డిని వివరణ కోరగా గతంలో గ్రంథాలయ భవనంలో తాత్కాలికంగా సచివాలయాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. సచివాలయ భవనం నిర్మాణ దశలో ఉందని, సచివాలయాన్ని వేరే భవనానికి మార్పుచేసి, గ్రంథాలయం ఉండేలా చూస్తామన్నారు.

బాగుపడిన రాజుపాళెం రోడ్డు

సాక్షి ఎఫెక్ట్..



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణ పరిధిలో రాజుపాళెంరోడ్డుకు కమిషనర్ బాలకృష్ణ మరమ్మతులు చేయించారు. ఇటీవల రోడ్డు అధ్వానంగా తయారవడంపై 'సాక్షి'లో 'దుర్భరంగా రహదారి' శీర్షికన కథనం రావడంతో కమిషనర్ స్పందించారు. గుంతలను కంకర, చిప్స్ పొడితో పూడ్చించి తాత్కాలికంగా సమస్యను పరిష్కరించారు. దీంతో వాహనదారులు, పాదచారులు హర్షం వ్యక్తం చేశారు. నూతన రోడ్డు నిర్మాణం చేపట్టి శాశ్వతంగా సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యలపై అర్జీల సమర్పణ



అర్జీని స్వీకరిస్తున్న తహసీల్దార్

పొదలకూరు: ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదికలో భాగంగా వివిధ గ్రామాలకు చెందిన రైతుల నుంచి వినతిపత్రాలను తహసీల్దార్ శివకృష్ణయ్య సోమవారం స్వీకరించారు. పాస్‌పుస్తకాలు, భూవివాదాలు, కొలతలు తదితరాలపై అర్జీలను అందజేశారు. వీటిని సంబంధిత వీఆర్వోలకు అందజేసి.. విచారణ జరిపి పరిష్కరించాలని సూచించారు.

వరిలో సస్యరక్షణపై అవగాహన



క్షేత్ర పరిశీలన చేస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

ఇందుకూరుపేట : వరి పంటను ఆశించే తెగుళ్లను రైతులు సకాలంలో గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. మండలంలోని జగదేవిపేట గ్రామంలో జిల్లా వనరుల కేంద్రం (ఆత్మ) ఆధ్వర్యంలో వరిలో సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త మధుసూదన్ మాట్లాడుతూ క్షేత్ర సందర్శనలో వరి పంటలో కంకినల్లి తీవ్రంగా కనిపిస్తోంది. దీని వల్ల మొక్కలు ఎండిపోయి రైతులు దిగుబడి కోల్పోతారన్నారు. దీని నివారణకు ప్రొపినోఫాస్ లేదా ఓమైట్ 2 మి.లీ.ను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కృషి విజ్ఞాన్ కేంద్రం శాస్త్రవేత్త నారాయణస్వామి మాట్లాడుతూ వరిలో పొట్టకుళ్లు తెగులు ఎక్కువగా వ్యాప్తి చెందుతోంది. రైతులు సమయానికి గుర్తించకపోతే దిగుబడి దెబ్బతింటుంది. దీనికి నివారణగా టిల్ట్ (ప్రొపికోనాజోల్) 200 మి.లీ.ను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఏఓ డీ రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులై ఉండి ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని రైతులు ఈ నెల 20వ తేదీలోగా గ్రామ సచివాలయాల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. రైతుసేవా కేంద్రాల్లో తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని తెలిపారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ దేవసేన, ఏఓ రామ్మోహన్, శాస్త్రవేత్త మధుసూదన్, నారాయణస్వామి, దీక్షిత పాల్గొన్నారు.